# 40. రాకెట్ శర్మ

'ఏం చేస్తాం? ఒక్కొక్కళ్ళు చేసుకున్న కర్మ, అనుభవించక తప్పదు' అంది శ్యామలాంబ రామరత్నంతో, ఆవిడకి అతను బాగా దూరపు బంధువు. అయితే, ఓపిగ్గా తను చెబుతున్న ప్రతిముక్కా ఎంతో ఆసక్తిగా వింటున్న అతనివైపు చూస్తూంటే శ్యామలాంబకి ఆ క్షణాన అంతకన్న దగ్గిరవారు లేరనిపించింది.

"మళ్ళీ మీ బావగనక బజార్నించి వచ్చినట్టయినా మీతో ఇవన్నీ చెప్పుకునే అవకాశం ఉండదు, అన్నయ్యగారూ! ఎంత బాధయినా అలా కడుపులో పెట్టుకుంటారు గాని, మీ బావ పైకి తేలరు. ఆడదాన్ని...... ఎవరితో నయినా చెప్పుకుంటే గాని, పిచ్చెత్తిపోయేలా ఉంది నాకు. ఏమిటి దీని ధోరణి అని చీదరించుకోకుండా, సాటి మనిషిని సానుభూతితో అర్థం చేసుకుని చివరంటా వినే మనిషి ఇన్నాళ్ళకి దొరికారు నాకు" అంటూ శ్యామలాంబ గోడకి జార్లపడికూచుని చేతులూ, కళ్ళూ తిప్పుతూ అలా చెబుతూనే ఉంది:

తలకింద చేతులు కీలించి పడక్కుర్చీలో కూచుని, అప్పుడప్పుడు ఫాలో అవుతున్నట్టు మెడా, కళ్ళూ, తిప్పుతూ, ఆగకుండా పాదాలు ఊపుతూ రామరత్నం అలా వింటూనే ఉన్నాడు:

నీళ్ళు తగినంత లేనందుకు దుఃఖపడి, వంట గదిలో మూకుళ్ళోని కూర ముఖం మాడ్చుకున్నట్టుంది. తన నిండా ఉన్న పాలు పిల్లి దొంగతనం చేసిందని స్టీలు గిన్నె ఆంతరంగం బావురు మన్నట్టుంది. నిన్నటి కూర డబ్బులు ఇవ్వలేదని వీధిలోంచి అరచి అరచి కాయగూర లమ్మి అక్కణ్ణుంచే మనసారా దీవించి వెళ్ళిపోయినట్టుంది.

వాళ్ళిద్దరికీ ఇవేవీ పట్టినట్టు లేదు. అక్కడికయినా ఆ టాపిక్ పూర్తయినట్టూ లేదు!

తిరుగు రైల్లో ఇంటి ముఖం పడుతున్నప్పుడు మాత్రం రామరత్నం తీరిగ్గా శ్యామలాంబ చెప్పిందంతా నెమరువేసుకున్నాడు.

అవును. ఆవిడ చెప్పిన కబుర్లకి అంతులేదు. అలాంటి కథలకు ముగింపు లేదు. కొన్ని సంకుచిత చట్రాల్లో బిగింపబడి ఉన్న నేటి సాంఘిక జీవితంలో ఒకే రకపు ఆలోచనల్ని అవే ఆదర్శాలనీ, నీతి సూత్రాలనీ భ్రమపడే కాలంలో, వ్యతిరేక అభిప్రాయాల్ని ప్రకటించి కూడా ప్రయోజనం లేదు. ఇంతకీ శ్యామలాంబలాంటి వాళ్ళు ఎదుటివాళ్లతో చెప్పడంలో ఉద్దేశం ఏదైనా, పరిష్కారం సూచించమని కాదు. కేవలం వాళ్ళు చెప్పింది శ్రద్ధగా వినమనే! అంత కరెక్టయిన అభిప్రాయానికి తిరుగనేది ఉండదని వాళ్ళ ఆత్మవిశ్వాసం, రామరత్నం మౌనంగా ఉండిపోవడం శ్యామలాంబ చెప్పిందంతా ఆమోదించి మాత్రం కాదని ఆమె గ్రహించే అవకాశం ఈ జన్మలో లేదు. ఆవిడ చెప్పినా, ఆవిడ మొగుడు చెప్పకపోయినా వాళ్ళ అభిప్రాయం ఒకటే, వాళ్ల ఏకైక పుత్రరత్నం సోమనాథ శర్మ, పూర్తిగా పాడైపోయాడని! 'పిల్లల్ని కనగలం గాని, వాళ్ల రాతల్ని కనలేం కదా, అన్నయ్యా! పైన శనిగాడు తంతూంటే వాడికి

మరోరకం బుద్ధులు రమ్మంటే మాత్రం ఎలా వస్తాయి లెండి? ఆడపిల్లయినా, మొగపిల్లాడయినా, మా దినం తీరవలసింది మా శర్మగాడి ఒక్కడివల్లనే కదా! వాడిమీదే అన్ని ఆశలూ పెట్టుకుని కంటికి రెప్పలా పెంచుకున్నాం. ఇంటర్ దాకా ఇంటిపట్టున ఉండి నా చేత్తోనేనింతచేసి పెడుతున్నంతకాలం మేం గీసిన గీటు దాటకుండా సాక్షాత్తూ శ్రీరామచంద్రుడిలా పెరిగాడు. 'చెడు సావాసాలు చేసి పిల్లాడు పాడైపోతాడండీ' అని నేనెంత మొత్తుకున్నా మీ బావ వింటేనా? 'మరేం లేదా పోదా, పై ఊళ్ళో చదువులు వెలిగించి వీడు మనల్ని ఉద్ధరించాలా!' అంటే చెవిన పెడితేనా? మంచి మార్కులు వస్తున్నాయి. ఇంజనీరింగులో పై ఊళ్ళో యూనివర్సిటీలో చేర్పించి తీరతానని పట్టుపట్టి కూచున్నారు. ఉన్న పొలం కాస్తా తణకాపెట్టి వేలకి వేలు గుమ్మరిస్తే గాని ఆ చదువు పూర్తయింది కాదు. డిగ్రీ రావడమే కాదు. ఆఖరేడులో ఉండగానే భిలాయి కంపెనీవాళ్ళు వీడిచేత ఎగ్రిమెంటు రాయించుకొని మంచి ఉద్యోగం కూడా ఇచ్చారు. అంతా బాగానే ఉంది. మా తలరాత తప్ప!"

ఏం జరిగిందని అతను అడగలేదు..... అడగకుండానే ఆవిడ కొనసాగిస్తుందని ఎరుగుదును గనక!

"పైకి చెప్పలేం, లోపల దాచుకోలేం, నవ్వే వాళ్ళకి నవ్వేసందూ, దెప్పేవాళ్ళకి దెప్పే సందూ ఏదో మీలాంటి ఆప్తులముందు వెళ్ళగక్కుకుంటే గుండె కాస్త తేలిక అవుతుందని ఆశ. చెప్పిందే చెప్పి మీకు విసుగు కలిగిస్తున్నానో, ఏమిటో..... నా కడుపుమంట అలాంటిదండి, అన్నయ్యా! ఇంతకీ ఇంతవాణ్ణి అంతవాణ్ణి చేసింది మేమే కదా! మా ఆశలు మాకు ఉంటాయి. అదైనా లేనిపోని దురాశ కాదు కదా! అందరు తల్లిదండ్రులు కోరిందే మేమూ కోరాం ఎప్పుడేం పాపం చేసుకున్నామో, మమ్మల్ని ఇలా క్రుంగికృశించమని ఆ దేవుడు రాశాడు!"

ఇంతటి ఇంద్రటక్షను అయాక గాని శ్యామలాంబ అసలు విషయం బయటపెట్టలేదు. పదహారేళ్ళు వెళ్ళే వరకూ సోమనాథ శర్మ తల్లిదండ్రులు ఏం చెప్పినా మారుమాటాడకుండా తు.చ. తప్పకుండా అత్యంత భక్తి శ్రద్ధలతో ఆచరించేవాడు. తక్కినవన్నీ అలా ఉంచి ఈ రోజుల్లో కూడా కాఫీ టీలు తాగనివాడూ, చుట్టా బీడీ వెలిగించని వాడూ ఉన్నాడంటే ఆ కుర్రాణ్ణి చూస్తేగాని నమ్మలేకపోయేవారు! పొద్దుట ఆరోగంట అయేసరికి అన్ని పనులతో పాటు సంధ్యావందనం కూడా ముగించుకుని చదువుకి కూచునేవాడు. బాగా డబ్బున్న వారింట్లో పుట్టిన ఒకే ఒక్క వంశాంకురం ఎలాంటి గారాం లేకుండా ఆదర్శప్రాయంగా పెరుగుతూంటే సోమనాథ శర్మతో పాటు అతన్ని అలా పెంచిన తల్లిదండ్రుల్ని కూడా ఆ రోజుల్లో అందరూ వేనోళ్ళ పొగిడేవారు. కాని, ఆ సౌభాగ్యం ఎంతవరకు? ఆ నాలుగు గోడల ఇంటి మధ్య ఉన్నంతవరకే. ఆ ఊరు దాటనంతవరకే!

అంతవరకు ఎందుకు? సినిమా అంటే మేం ఎరగం. చూస్తే పాడైపోతాడని పిల్లాణ్ణి ఒక్కసారైనా పంపి ఎరగం. ఇంకా ఇలా ఆంధ్రా యూనివర్శిటీలో చేర్చి ఆర్నెల్లయిందో, లేదో మీ బావగారు ఏదో పనుండి విశాఖపట్నం వెళ్ళి సాయంకాలం ఏ ఆరింటికో వాడి హాస్టలు రూమ్‌కి వెళ్ళి

రూమ్‌మేటుని అడిగితే 'మీవాడు ఈ వేళకి జగదాంబా సినిమా హాలు టిక్కెట్ల క్యూలో దొరకొచ్చు. ట్రై చెయ్యండి 'అని సలహాట! ఆరోజే తల బద్దలు కొట్టుకుని సిగ్గుతో ఎందుకు చచ్చిపోయాం కాదో? మా అబ్బాయి మీ బావగారికి దొరికింది సరిగ్గా అక్కడేనుట!"

ఆ తర్వాతి కథనం ఓ శ్యామలాంబ కాస్త స్పీడు ఎక్కువ చేసినట్టు అనిపించింది రామరత్నానికి.

"బంతి అనేది మొదట ఓ మెట్టు మీంచి దొర్లకపోవడం అంటూ జరగాలేగాని, ఆ పతనానికి అంతం ఎక్కడ అన్నయ్యగారూ! నాలుగో గంటకి నిద్రలేచే కుర్రాడు, ఎనిమిదిన్నరకి గాని లేవడు. చేతిలో పని దెబ్బలాడి అందుకొనేవాడు, పదిసార్లు చెప్పినా వీధి చివరికెళ్ళి కొబ్బరికాయ అయినా కొనుక్కురాడు. తగని బద్ధకం విపరీతమైన అశుభ్రం. నా చేతుల్తో నేను పెంచిన నా కొడుకేనా వీడు అనిపించేది. కిట్టనివాళ్ళు ఏ మందూమాకూ పెట్టి మనసు విరిచేశారో అని హడలి చచ్చిపోయేదాన్ని ఇంతింత చెంపలు. నరసింహ స్వామి వేషంలా మొహం కనపడకుండా జుత్తు ఇదంతా ఇంటిపట్టున ఏ శలవులకో వచ్చి ఉన్నప్పటి ముచ్చట! ఇంక అక్కడేం వెలగబెడుతున్నాడో నాయన, అని రాత్రి కన్ను మూతపడేది కాదు, ఇలా ఓ ఏడుకి ఓ ఏడు కుర్రాడు విజృంభిస్తుంటే కన్న తండ్రి అనేవాడు కలగజేసుకోవాలంటారా? ఉహూ మీ బావగారి లాంటి మనిషిని మళ్ళీ చూడబోం ఆయన ఆఫీసేమో, ఆ లోకమేమో, అంతే నేను ఏడ్చి మొత్తుకున్నా ఆయన పట్టించుకుంటేనా! ఇప్పుడెవర్ని నిందించి ఏం లాభం? చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టయింది. అన్నయ్యగారూ, మాపని, రెండేళ్ళయింది ఉద్యోగంలో చేరి, కట్సు పోను వెయ్యి రూపాయలు చేతి కందుతున్నాయని వాడే చెప్పేడు "ఒక్కడివి, నెలకి అంత సొమ్ము ఏం చేసుకుంటావురా?" అని అడిగితే "నిజమే సుమా, అమ్మా, ఒక్కరికి వెయ్యి ఎక్కువే! నాన్న జీతమూ, మన ఇళ్ళ అద్దెలూ కలిసి మనకి ఎలాగయినా మూడువేలు నెలకి ముదుతున్నాయి కదా. మీ ఒక్కొక్కరికి పదిహేనేసి వందలు దొరుకుతోంది. ఎక్కువ కాదా అని!" అని మళ్ళీ మాటాడకుండా జవాబు! " ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తల్లిదండ్రుల్ని ఆదుకోవడం మంచిదే కాని, అలా లేనప్పుడు నెల నెలా పంపడం అవమానించడం కాదా?" అనే విమర్శ ముక్తాయింపు ఒకటీ!"

"పోనీ ఇంత ఖర్చుపెట్టి వీడికి చదువు చెప్పించాం. ఇంజనీరు చదువంటే ఈ రోజుల్లో మాటలా! వీడిచేత్తో వీడు ఓ పైసా మా చేత్తో పెట్టకపోతే పోయింది. వీడిద్వారా జరగవలసిన అచ్చట్లూ ముచ్చట్లూ అయినా మాకు తీరాలంటారా, అన్నయ్యా? ఇంజనీరుకి చచ్చు లక్ష కట్నం పలుకుతోంది మార్కెట్లో! అమ్మా పెట్టా పెట్టదూ, అడుక్కు తినానివ్వదు అన్నట్టు పైసా కట్నం పుచ్చుకోడట మా ప్రబుద్ధుడు! ఇదెక్కడి తప్పుడు కూతండీ! ఊరంతా ఓ దారి అయితే, ఉలిపి కట్టెది ఓ దారి అన్నట్టు ఇలాంటి వెర్రి వేషాలేస్తే పెళ్ళి కొడుక్కేదో లోపం ఉండే ఉంటుంది అని నలుగురూ చెప్పుకోరూ! అలా అయితే ఇక వీడికి జన్మలో పెళ్ళవుతుందా? ఎందుకూ, వేలకి వేలు తగలేసి మళ్ళీ పెద్ద చదువులు వెలగబెట్టాడూ, ఆమాత్రం ఇంగిత జ్ఞానం లేకపోయాక? అంతేకాదు. అన్నయ్యగారూ చెప్పుకుంటే

సిగ్గుచేటు! పెళ్ళంటూ చేసుకుంటే, ఏదో ఆఫీసులో కాగితాల పద్ధతిమీద గాని చేసుకోడట! ముందే ఆడపిల్ల బతుకుని పాడుచేసి, దానికేదో కడుపో కాలో వస్తే ఆఘోరించినట్టు........ ఎవర్నీ పిలవా పెట్టకుండా ఈ రహస్యపు పెళ్ళి ఏమిటంట? హవ్వ! ఇంటావంటా ఎరుగుదుంటండీ ఇలాంటి దిక్కుమాలిన బుద్దులు! ఇలా ఒకటా రెండా! ఒక్క ముక్క మేము గనక అంటే చిన్నంతరం పెద్దంతరం లేకుండా మరి మాటాకుండా లెక్చర్లమీద లెక్చర్లు! "ఈ కాళ్ళు కడుగుపళ్ళాలూ, ఈ పానకం బిందెలూ......... ఇదే పెళ్ళి సంస్కృతే అయితే వీటిని ఇప్పుడే కాదు, నా ఆఖరి ఊపిరి దాకా వీటిని తిరస్కరిస్తూనే ఉంటాను" అని ఏకంగా మీ బావగారి ముఖంమీదే దులిపెయ్యడం! చాలు, అన్నయ్యగారూ, చాలు, పాలు తాగిన రొమ్ముమీద గుద్దడం అంటే వేరే ఉండదు. చిన్నప్పట్నుంచీ ఇంతవాడిగా చెయ్యడానికి మాచాకిరీ పనికొచ్చింది. ఇంత చదువు చదివి ఈ ఉద్యోగం దొరకడానికి మా డబ్బు పనికొచ్చింది. ఇవాళ మామాట పనికిరాలేదు! అంతే కదా! కానివ్వండి. ఊపిరున్నన్నాళ్ళూ ఎలాగో అలా బతక్కపోము." అంటూ ముగించింది శ్యామలాంబ, ముక్కు చీదుకుంటూ

ఓ నిశ్చయానికి వచ్చేసినవాళ్ళతోనూ, మనది కాని అభిప్రాయం అంటూ మరోటి ఉంటుందని గుర్తించని వాళ్ళతోనూ ఆర్గ్యుమెంటు అవసరంలేదు. తిరుగు ప్రయాణంలో ఇవన్నీ తిరగదోడుకున్న రామరత్నం మనసుకి చివరికి నిర్లిప్తతే మిగిలింది! సోమనాథం మంచి చెడ్డలు కనుక్కోమని తన మనసుని ఒకరు పురమాయించనక్కర్లేదు. ఆ కుర్రాడి తెలివితేటలూ, ఎప్పుడూ మంచి మార్కులు వస్తూండడం పెళ్ళికాని ఓ పిల్ల తండ్రిగా తనకు తానుగా తన స్వార్థ బుద్ధితో మొదట్నుంచీ గమనిస్తూనే వస్తున్నాడు. ఇంతకీ అతను మొట్టమొదట భిలాయి వెళ్ళి సోమనాథంతో రెండ్రోజులు గడిపి మరీ శ్యామలాంబగారి ఊళ్ళో దిగాడు. నిజానికి శ్యామలాంబ ఊళ్ళో అతను దిగింది శర్మ గురించి వినడానికి కాదు, చెప్పడానికి! కాని, ఆ ధోరణి చూస్తే తనది తప్ప మరో దృక్పథం ఉంటుందని ఆమె ఒప్పుకొనేటట్టు కనిపించలేదు. ఆమె గుండె బండరాయి చేసేసుకుంది. మామూలుది కాదు.... మూఢనమ్మకాల పాకుడుతో పరవశించే నూతి చప్టా అది చూసి అదే ప్రపంచమని ఆ పక్కనున్న నూతిలో కప్పల్లా కాపురం పెట్టుకున్నారు ఆవిడా, మొగుడూ, ఆ నూతిలోనే, వాళ్ళ నీడలోనే ఇమిడి ఉంటే సోమనాథం శర్మ మహా అయితే పేరుపడిన చిరుకప్పగా రూపుదిద్దుకొనేవాడేమో! మదర్ కాప్స్యూల్ విడిపడి, తనదైన సూటి మార్గంలో ఎగిరి నిలదొక్కుకుని ఊహించలేని వేగంతో చైతన్యంతో తన స్వరూపాన్ని వ్యక్తీకరించుకున్నాడు సోమనాథ శర్మ. వచ్చిన జీతంలో తనకు సరిపడే తక్కువ మొత్తం మాత్రమే ఉంచుకుంటున్నాడు అతను. మిగిలిందంతా అటు ఇటు విరాళాలకే. కేవలం ఫ్యాక్టరీలో విధి నిర్వహణలోనే కాదు, సాటి మానవుడికి సహాయపడే ఏ సంస్కార కార్యక్రమంలో అయినా వాడిది ముందడుగు. తన కూతురు ఏ క్వాలిఫికేషనుతో అతనికి అర్ధాంగి కాగలదు! అంతవరకు ఎందుకు, మంచి రోజు చూసుకోనిదే ఉత్తరమైనా పోస్టు చెయ్యని రామరత్నం మాత్రం ఏ మొహం పెట్టుకుని సోమనాథాన్ని తన అల్లుడుగా ఊహించగలడు!

ఆ కుర్రాడు అంత కఠినంగా కనిపెంచిన తల్లిదండ్రులతో మాటాడ్డం మాత్రం కొంతవరకు తప్పే అనిపించింది రామరత్నానికి కాని, అతన్ని అలా అనిపించిన పరిస్థితులు ఏమిటో మరి!

"ఇంతకీ మీ అమ్మాయిని మా శర్మకిచ్చే విషయం స్వయంగా ప్రయత్నిస్తానన్నారు ఏం చేశారు, అన్నయ్యా" అంటూ శ్యామలాంబ ఆ తర్వాత రాసిన ఉత్తరానికి మాత్రం టక్కున జవాబు రాసేశాడు.

"నువ్వు అంతగా పూసగుచ్చినట్టు చెప్పినా వేరే వెళ్ళి చూడాలా, అక్కయ్యా! సొంత కొడుకైనా అనుకోకుండా నిజం చెప్పినా కూతురు బతుకు నిలబెట్టిన త్యాగమూర్తి నువ్వు. ఏదో భూమ్మీద సంబంధం చూసి ముడిపెడతాను, సోమనాథ శర్మ ఇప్పుడు మన లోకంలో ఉన్నాడా!" శ్యామలాంబ మాదిరి రామరత్నం కూడా నూతిలోని కప్పలాంటివాడే. కాని ఈ ఈ కప్పకి ఆకాశమనేది కొంతవరకైనా అక్కణ్ణుంచైనా కనపడగలదనే అవగాహన ఉంది. చూడడమేగాక స్పందించగల స్వల్ప జ్ఞానం కూడా ఉంది!

★